ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

ఆదివారం | అక్టోబరు 11, 2026 | సంపుటి : 7 | సంచిక : 112 | పేజీలు : 2




## సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

■ **ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**

**ఆత్మకూరు, ఆయుధం:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని పోచమ్మ గుడి వద్ద నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని, వారికి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.



# పూల జాతర

## ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబురాలు

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ సంబురాలు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి.. బతుకు చిత్రమే పాటగా మార్చి సంప్రదాయ దుస్తుల్లో మహిళలు, చిన్నారులు బతుకమ్మ ఆడారు. 9 రోజుల పాటు బతుకమ్మ సంబురాలు కనుల పండువగా జరగనున్నాయి. మహిళలు సహజసిద్ధమైన తీరొక్క పూలతో ఇంటింటా బతుకమ్మను పేర్చి... పసుపు, కుంకుమలతో గౌరమ్మను చేసి భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ ఆ తర్వాత వరుసగా అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు, నానేబియ్యం, అట్ల, అలిగిన, వేపకాయ, వెన్నముద్దల బతుకమ్మల ఉత్సవాలు జరుగుతాయి. చివరిరోజు సద్దుల బతుకమ్మను రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. వరంగల్, హనుమకొండ, తదితర చోట్ల పెద్ద సంఖ్యలో మహిళలు, చిన్నారులు ఒక్క చోట చేరి బతుకమ్మ ఆడారు. బతుకమ్మ నిర్వహణ కోసం ప్రభుత్వ అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయం ఆవరణలో బతుకమ్మ వేడుకలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి-నీలిమ దంపతులు హాజరయ్యారు. అలాగే వరంగల్ రామన్నపేట రామలింగేశ్వర స్వామి టెంపుల్ ఆవరణలో కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి మహిళలతో కలిసి ఆడిపాడారు.**

- ఉత్సాహంగా ఆడిపాడిన మహిళలు
- ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం







## మోదీజీ ఎంతమంది పోలీసులనైనా తెచ్చుకోండి

■ **మేం వెనక్కి తగ్గబోం: రాహుల్ గాంధీ**



**ఢిల్లీ, ఆయుధం:** ఢిల్లీ సీజేపీ ఆందోళనల నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. మోదీ, ఆర్ఎస్ఎస్‌పై తాను పదేళ్లకుపైగా పోరాడుతున్నట్లు తెలిపారు. వారి అసలైన లక్షణం పిరికితనమంటూ ఆరోపించారు. గత 15 ఏళ్లలో దేశానికి ఏం జరిగిందో, అది మళ్లీ జరగనివ్వమని స్పష్టం చేశారు. రాజ్యాంగంపై దాడి చేసిన ఈ పాలకులను దించి తీరుతామని పునరుద్ఘాటించారు. "మోదీ గారూ మీకు నచ్చినట్లు చేయండి. పోలీసులందరినీ రంగంలోకి దించండి. 10 వేలు, 20 వేలు, 50 వేలు మీకు ఎంతమంది కావాలంటే అంతమందిని రప్పించండి. నాయకులు, యువకులు అందరినీ అరెస్టు చేయండి. మేము మిమ్మల్ని చుట్టుముట్టాం, వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. యువతా మిమ్మల్ని చూస్తుంటే గర్వంగా ఉంది. నిరసనలను కొనసాగించండి’" అని పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియో రిలీజ్ చేశారు. మోదీ, అమిత్‌షా, మోహన్‌భాగవత్, జ్ఞానేశ్‌కుమార్, అజిత్ ఢోబాల్ విలన్లు అంటూ ఎద్దేవా చేశారు.



## ఎల్‌నినోతో తీవ్ర సంక్షోభం

■ **విద్యుత్ ఆధారిత పనులను తాత్కాలికంగా వాయిదా వేయడం ఉత్తమం: సీఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్, ఆయుధం:** ఎల్‌నినో వల్ల భవిష్యత్‌లో తీవ్ర సంక్షోభం ఎదుర్కోవాల్సి వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వచ్చే ఏడాది జూన్ వరకు సాగు, తాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యలపై సరైన యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిందేనని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితులపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. పలు అంశాలపై వారికి దిశానిర్దేశం చేశారు. విద్యుత్ సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. విద్యుత్ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నప్పటికీ.. మార్కెట్‌లో విద్యుత్ అందుబాటులో లేదన్నారు. ‘‘అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. విద్యుత్ ఆధారిత పనులను తాత్కాలికంగా వాయిదా వేస్తే మంచిది. ప్రతీ కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలి. ఎల్‌నినో ప్రభావంపై సినిమా, మీడియా, వివిధ మాధ్యమాల ద్వారా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజలకు అవగాహన కల్పించాలి. నీటి సమస్య తీవ్రతరం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలి. చుక్క నీరు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి’’ అని సీఎం పేర్కొన్నారు.



## ఘనంగా గడ్డం కేశవమూర్తి జన్మదిన వేడుకలు

■ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

**హనుమకొండ, ఆయుధం:** టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి జన్మదిన వేడుకలను శనివారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఆయనకు శాలువా కప్పి సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఆయన చేస్తున్న సేవలను పలువురు కొనియాడారు. జర్నలిస్టుల ఐక్యత కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు, జర్నలిస్టులకు మధ్య వారధిగా నిలుస్తూ వార్తా రంగంలో తనదైన పాత్ర పోషిస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా కార్యదర్శి ఉటుకూరు సాయిరాం, కోశాధికారి విష్ణు వర్ధన్, టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకణాల సంతోష్, తోట సుధాకర్, రాష్ట్ర హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, తెలంగాణ డిజిటల్ మీడియా ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన నాగరాజు, సీనియర్ జర్నలిస్టులు వేముల రాజేశ్వర్ రావు, దండు మోహన్, రజాక్, పాషా, సోమనర్సయ్య, దాసరి ధనుంజయ, సలెంద్ర రవీందర్, చెలిక రాజేంద్ర ప్రసాద్, సిద్దోజు రాకేష్, పలువురు జర్నలిస్టులు పాల్గొని కేశవమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు.

### శ్రీ భద్రకాళి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు

## ఎంపీ రవిచంద్ర కు ఆహ్వానం

■ **అమ్మవారి 'పూలంగి సేవ' నిర్వహణ మా అదృష్టం : ఎంపీ రవిచంద్ర**

**వరంగల్, ఆయుధం:** ఓరుగల్లు శ్రీ భద్రకాళిదేవి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు కుటుంబ సమేతంగా హాజరు కావాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్రవిజయలక్ష్మి దంపతులను దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత కోరారు. ఈ మేరకు శనివారం దేవాలయం ప్రధాన అర్చకులు భద్రకాళి శేషుతో కలిసి ఆయనకు ఆహ్వాన పత్రిక, తీర్థప్రసాదాలు అందజేశారు.
ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ ఈ నవరాత్రులు అమ్మవారికి, అమ్మవారి శేష వాహనములకు ఉదయం సాయంత్రం 'పూలంగిసేవ' చేసుకునే భాగ్యం మా కుటుంబానికి కలగడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం వివిధ రూపల్లో కొలువుతీరే అమ్మవారిని, శేష వాహనములను వివిధ రకాల పుష్పములచే గజమాలలతో సర్వాంగ సుందరముగా అలంకరింపచేసి అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని.. కావున భక్తులందరూ ప్రతిరోజు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని అమ్మవారి కృపకు పాత్రులై తీర్థప్రసాదములు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్చకులు అరవింద్ శర్మ, భరద్వాజ్ శర్మ, ఆలయ సిబ్బంది సూపరింటెండెంట్ కూచన హరినాథ్, నాగులు



తదితరులు పాల్గొన్నారు.

### హనుమద్గిరి పద్మాక్షి దేవి నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం



హనుమద్గిరి పద్మాక్షిని ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయం అందిస్తున్న బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నివాసానికి విచ్చేసిన ఆలయ అర్చకులు నాగిళ్ల షణ్ముఖ శర్మ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలకు కుటుంబ సమేతంగా రావాల్సిందిగా కోరుతూ అమ్మవారి ఆహ్వాన పత్రికతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు.

## అశాస్త్రీయంగా వరంగల్ విభజన

- జిల్లా ప్రజలకు తీరని అన్యాయం చేశారు
- హనుమకొండలో కాంగ్రెస్ నిరసన
- కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



**హనుమకొండ, ఆయుధం:** కాకతీయుల చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన వరంగల్ మహానగరాన్ని స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అశాస్త్రీయంగా విభజించి, జిల్లా ప్రజలకు తీరని అన్యాయం చేసిన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీరును వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. వరంగల్ జిల్లాల విభజనకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. డీసీసీ భవన్ నుంచి అశోక జంక్షన్ వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి, కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు నల్లజెండాలు, నిరసన నినాదాలతో తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. జిల్లాల విభజనకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని, చారిత్రక నేపథ్యం, భౌగోళిక స్వరూపం, ప్రజల అవసరాలు, యువత భవిష్యత్తును పరిగణనలోకి తీసుకోకుండా రాజకీయ ప్రయోజనాల కోసం వరంగల్‌ను విభజించడాన్నే వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాను అశాస్త్రీయంగా విభజించడం వల్ల ఈ ప్రాంత చారిత్రక ప్రాధాన్యత దెబ్బతినడంతో పాటు, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు, స్థానికత ఆధారంగా లభించాల్సిన ప్రయోజనాల విషయంలో అనేక సమస్యలు ఎదురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనే ఈ అన్యాయాన్ని పలుమార్లు ప్రశ్నించామని, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వరంగల్ అభివృద్ధికి తీవ్ర నష్టం కలిగించిందని విమర్శించారు. కాకతీయుల పాలనా వైభవానికి, తెలంగాణ చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచిన వరంగల్ కోట, వేయి స్తంభాల దేవాలయం, చారిత్రక కట్టడాలు ఉన్న ఈ ప్రాంతాన్ని పరిపాలనా సౌలభ్యం కంటే రాజకీయ లెక్కలకే ప్రాధాన్యమిస్తూ విభజించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వరంగల్ నుంచి మొదలయ్యే ప్రజా ఉద్యమాలు రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేస్తాయనే భయంతోనే ఈ ప్రాంత రాజకీయ ఐక్యతను దెబ్బతీసేలా జిల్లాల విభజనకు పాల్పడ్డారనే విమర్శను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఈ సందర్భంగా ముందుకు తెచ్చారు. సిద్ధిపేటకు ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో వరంగల్ అభివృద్ధిని విస్మరించారని, ఈ ప్రాంతానికి రావాల్సిన ప్రాధాన్యతను, అవకాశాలను దూరం చేశారని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కుడా చైర్మన్ గుండు సుధారాణి, లైబ్రరీ చైర్మన్ అజీజ్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, జిల్లా కమిటీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పండుగ పూట విషాదం

■ **బావిలో దూకి తల్లీ, ఇద్దరు పిల్లల మృతి**

**కురవి, ఆయుధం:** మహబూబాబాద్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కురవి మండల పరిధిలోని లింగయ్య తండాకు చెందిన బానోతు నవీన్ అనూష దంపతులు. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. శనివారం మధ్యాహ్నం బానోతు అనూష (26) తన చిన్న కుమార్తె వర్షిణి(9), కుమారుడు విశాల్ కృష్ణ(4)ను తండా శివారులోని వ్యవసాయ బావి వద్దకు తీసుకొని వెళ్లింది. వారితో సహా అందులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సాయంత్రమైనా అనూష ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆమె కోసం వెతికారు. పొలం వద్ద ఉన్న బావిలో అనూష మృతదేహాన్ని గుర్తించారు. అందులోకి దిగి గాలించగా ఇద్దరు పిల్లల మృతదేహాలు లభ్యమయ్యాయి. సమాచారం అందుకున్న మహబూబాబాద్ రూరల్ సీఐ అంజలి, కురవి ఎస్సై సతీశ్ ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.









# పూల జాతర







## బతుకమ్మ సంబరాల్లో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయానికి ప్రతికగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా పాలకుర్తి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం నుండి ఆడపడుచులతో సహా తీరక పువ్వులతో పేర్చినటువంటి బతుకమ్మను తీసుకొని బతుకమ్మ కుంట వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి స్థానిక మహిళలతో కలిసి ఆడిపాడారు.





---

## దసరాకు ఊరెళ్తున్నారా..
# జాగ్రత్త!

- ప్రజల సహకారంతోనే నేరాల నివారణ సాధ్యం
- ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి.. : జనగామ రూరల్ సీఐ వేణు



**రఘునాథపల్లి, ఆయుధం:** దసరా పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే ప్రజలు ఇళ్ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జనగామ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేణు సూచించారు. ప్రజల సహకారంతోనే నేరాల నివారణ సాధ్యమని, అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ రఘునాథపల్లి, లింగాలఘణపురం, చిల్పూర్ మండలాల పరిధిలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
దసరా పండుగ నేపథ్యంలో చాలామంది కుటుంబాలతో కలిసి స్వగ్రామాలకు వెళ్తుంటారని, ఇదే అదనుగా భావించి దొంగలు ఇళ్లలో చోరీలకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో రాత్రి వేళ పోలీసు గస్తీని ముమ్మరం చేసినట్లు తెలిపారు. ప్రజలు కూడా ముందస్తు జాగ్రత్తలు పాటించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**పోలీసుల సూచనలు.. ఇవి పాటించండి**

- ఇంట్లోని బంగారు ఆభరణాలను బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలి. పెద్ద మొత్తంలో నగదును ఇంట్లో ఉంచకుండా బ్యాంకు ఖాతాల్లో భద్రపరచుకోవాలి. విలువైన వస్తువులు బయటకు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఊరికి వెళ్లే ముందు ఇంటి తలుపులు, కిటికీలు పటిష్టంగా ఉన్నాయో లేదో పరిశీలించి నాణ్యమైన తాళాలు వేయాలి.
- ఇంటికి తాళం వేసి వెళ్తున్న విషయాన్ని నమ్మకమైన ఇరుగుపొరుగు వారికి తెలియజేయాలి. అవసరమైతే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నవారు వాటి పనితీరును పరిశీలించి, మొబైల్‌లో ఫుటేజీని ఎప్పటికప్పుడు గమనించాలి. రాత్రి వేళల్లో ఇంటి ఆవరణలో లైట్లు వెలిగేలా చూసుకోవాలి.
- గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, చోరీకి సంబంధించిన అనుమానాలు కలిగినా వెంటనే పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సీఐ వేణు కోరారు. ప్రజల అప్రమత్తత, పోలీసుల సహకారంతో చోరీలను అరికట్టవచ్చని పేర్కొన్నారు.

---

# మెదక్‌లో దారుణం..

- తల్లిపై డీజిల్ పోసి నిప్పంటించిన కుమారుడు

**మెదక్, ఆయుధం:** మెదక్ జిల్లా టేక్మాల్ మండలం ఎల్లుపేట్‌లో దారుణం చోటు చేసుకుంది. మంత్రాలు చేస్తోందనే అనుమానంతో తల్లి సాయమ్మ(40)పై కన్న కొడుకే దాడి చేశాడు. ఆమెపై డీజిల్ పోసి నిప్పంటించాడు. కాలిన గాయాలతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. నిందితుడు 18ఏళ్ల దుర్గేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

---

## ఏఐటీయూసీ గెలుపు
# కార్మికుల నమ్మకానికి నిదర్శనం

- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- సిపిఐ జిల్లా కార్యాలయంలో విజయోత్సవ సంబురాలు




**హనుమకొండ, ఆయుధం:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసి) గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర స్థాయి గుర్తింపు సంఘంగా చారిత్రాత్మక విజయం సాధించడం పట్ల సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.ఈ విజయోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏఐటియుసి, ఆర్టీసీ నాయకుల సమక్షంలో ఘనంగా విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్మికులు,నాయకులు కేక్ కటి చేసి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ "ఆర్టీసీ ఎన్నికల్లో లభించిన ఈ అపార విజయం కేవలం ఒక యూనియన్ విజయం కాదని, ఇది యావత్ ఆర్టీసీ కార్మికుల విజయం అని, ఎర్రజెండా, ఏఐటీయూసీ పోరాట పటిమపై కార్మికులకు ఉన్న అచంచలమైన విశ్వాసానికి ఈ తీర్పు ప్రత్యక్ష నిదర్శనం అని తెలిపారు. ఈ విజయం కోసం శ్రమించిన ఎంప్లాయిస్ యూనియన్ నాయకులకు, కార్యకర్తలకు, అలాగే కూటమిగా ఏర్పడి మద్దతు తెలిపిన ఎన్ఎంయూ,టిఎంయూ తదితర కార్మిక సంఘాల నాయకులకు హృదయపూర్వక అభినందనలు." అని తెలిపారు. ఇటీవల ముగిసిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలతో పాటు, ఇప్పుడు రాష్ట్రంలో అతి పెద్ద రవాణా సంస్థ అయిన ఆర్టీసీ ఎన్నికల్లోనూ ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు విజయం సాధించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్ల సాధనకు, ప్రభుత్వంలో విలీన ప్రక్రియ పూర్తిస్థాయి అమలుకు, కార్మికుల సంక్షేమానికి సిపిఐ నిరంతరం అండగా ఉంటుందని, అసెంబ్లీ లోపల, వెలుపల కార్మికుల గొంతుకగా నిలుస్తుందని స్పష్టం చేశారు.ఈ వేడుకల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి,మద్దెల ఎల్లేష్,ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కు రాజు గౌడ్,జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, జిల్లా నాయకులు బత్తిని సదానందం, కొట్టేపాక రవి, మాలోతు శంకర్ నాయక్, దర్ముల రామమూర్తి, గుంటి రాజేందర్, యాకయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

---

## ఢిల్లీ పోలీసుల ఆంక్షలు
# అప్రజాస్వామికం

- AIYF జాతీయ కార్యదర్శి డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి



**వరంగల్, ఆయుధం:** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ, భారత ఎన్నికల సంఘం పనితీరును నిరసిస్తూ అక్టోబర్ 10న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించ తలపెట్టిన ప్రజాస్వామ్య నిరసనను అడ్డుకునేందుకు ఢిల్లీ పోలీసులు విధించిన అసాధారణ ఆంక్షలను ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (AIYF) జాతీయ కార్యదర్శి డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి తీవ్రంగా ఖండించారు. కేంద్ర హోంమంత్రి ఆదేశాల మేరకే ఈ ఆంక్షలు విధించారనే ఆరోపణలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమానికి అనుమతి నిరాకరించడం, భారీగా బారికేడ్లు ఏర్పాటు చేయడం, నిషేధాజ్ఞలు విధించడం, 57 మెట్రో స్టేషన్లను మూసివేయడం, ఢిల్లీకి వెళ్లే రైళ్లను రద్దు చేయడం, దేశంలోని పలు ప్రాంతాల్లో నిరసనకారులను గృహనిర్బంధంలో ఉంచడం, దేశ రాజధాని ప్రాంతమంతటా భారీగా భద్రతా బలగాలను మోహరించడం వంటివి ప్రజల రాజ్యాంగబద్ధమైన, ప్రాథమిక హక్కులపై దాడి చేయడమేనని ఆయన పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో విద్యార్థి కార్యకర్తలను నిర్బంధిస్తున్నట్లు, విద్యార్థి సంఘాల కార్యాలయాలపై నిఘా ఉంచినట్లు వస్తున్న వార్తలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ నిరసనలో పాల్గొనేందుకు విమానంలో ప్రయాణిస్తున్న AIYF, AISF కార్యకర్తలు, CJP నాయకులను అరెస్టు చేయడానికి పోలీసులు విమానం లోపలికి వెళ్లినట్లు వచ్చిన సమాచారం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని డాక్టర్ ఖాద్రి పేర్కొన్నారు. విమానంలోకి ప్రవేశించి కార్యకర్తలను అరెస్టు చేయడానికి ప్రయత్నించడం చట్టవిరుద్ధమైన చర్యగా ఆయన ఖండించారు. ప్రజాస్వామ్య ఉద్యమాల్లో పాల్గొనే వారిని భయభ్రాంతులకు గురిచేసి, శాంతియుత నిరసనలను అణచివేయాలనే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు

---




# పండగ పూట బస్సులు కిటకిట

- ప్రయాణికుల ఇబ్బందులు

**హైదరాబాద్, ఆయుధం:** దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారితో హైదరాబాద్‌లోని బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. ప్రజలు ఇబ్బందులు లేకుండా 7వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు టీజీఎస్ఆర్టీసీ ప్రకటించింది. జేబీఎస్, ఎంజీబీఎస్‌తో పాటు ఉప్పల్, ఎల్‌బీనగర్, ఆరాంఘర్ తదితర కూడళ్ల నుంచి కూడా ప్రత్యేక బోర్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేసింది. రద్దీ దృష్ట్యా శనివారం నుంచి ఈ నెల 22 వరకు 1300 బస్సులను వివిధ జిల్లాలకు నడిపేలా గ్రేటర్ ఆర్టీసీ ప్రణాళిక రూపొందించింది. శుక్రవారం 50 అదనపు బస్సులను పంపినట్టు గ్రేటర్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీధర్ పేర్కొన్నారు. పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లేందుకు బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు అంటున్నారు. గంటల తరబడి బస్టాండ్‌లోనే వేచి ఉండాల్సివస్తోందని వాపోతున్నారు. మరిన్ని బస్సులు నడిపి తమను గమ్యస్థానాలకు చేర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రజలు ఇబ్బందులు లేకుండా 7 వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఎంజీబీఎస్ నుంచి రోజూ 3400 సర్వీసులను ఆర్టీసీ నడుపుతుండగా పండగ నేపథ్యంలో మరో 1000 బస్సులను అదనంగా నడపాలని ఆర్టీసీ ప్రణాళికలు రూపొందించింది.

**ప్రైవేట్ వాహనాలే దిక్కు**

ఆర్టీసీ బస్సులు సరిపోకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా వారు అందిన కాడికి దండుకుంటున్నారు.

---

# విమానంలో పైలట్ స్మిత్‌పై దాడి

**కేసు నమోదు చేసిన ఎన్ఐఏ**

**ఢిల్లీ, ఆయుధం:** దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై కో పైలట్ కత్తితో దాడి చేసిన ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కేసు నమోదు చేసింది. ఇప్పటికే ఆ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసిన అధికారులు, దాడికి దారితీసిన పరిస్థితులు, విమానాన్ని హైజాక్ చేయడానికి ప్రయత్నం జరిగిందా? అనే అంశాలపై దర్యాప్తు చేయనున్నారు.
అయితే స్మిత్ మచ్చర్‌పై దాడి చేసిన ఘటనను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. భారతీయ పైలట్‌పై దాడి జరగడం, విమానాన్ని హైజాక్ చేయడానికి లేదా కూల్చివేయడానికి ప్రయత్నం జరిగి ఉండొచ్చనే అనుమానాల నేపథ్యంలో సమగ్ర దర్యాప్తు అవసరమని భావించింది. దీంతో జాతీయ దర్యాప్తు సంస్థకు కేసును అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఎన్ఐఏ అక్టోబర్ 9న కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. యాంటీ హైజాకింగ్ చట్టం2016లోని సంబంధిత నిబంధనలతో పాటు, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ)1967 కింద కేసు నమోదు చేశారు. యూఏపీఏలోని సెక్షన్ 16తో పాటు సెక్షన్ 15(1)(ఎ) నిబంధనలను కూడా ఆ కేసుకు వర్తింపజేసినట్లు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల్లో పేర్కొన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ చట్టం2008 ప్రకారం, ఈ కేసులో పేర్కొన్న నేరాలు ఎన్ఐఏ విచారణ చేపట్టేందుకు వీలున్న నేరాల జాబితాలోకి వస్తాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం చట్టంలోని సెక్షన్ 6లోని ఉప సెక్షన్లు 5, 8తో పాటు సెక్షన్ 8 కింద తన అధికారాలను ఉపయోగించి దర్యాప్తునకు ఆదేశించింది.

---

# ఈసీకి మద్దతుగా..

- 124 మంది విశ్రాంత ఐఏఎస్, ఐఎఫ్ఎస్‌ల బహిరంగ లేఖ

**ఢిల్లీ, ఆయుధం:** ఎన్నికల సంఘం నిర్ణయాలపై విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ.. ఈసీకి మద్దతుగా 124 మంది విశ్రాంత ఐఏఎస్, ఐఎఫ్ఎస్, అనుబంధ సర్వీసుల అధికారులు బహిరంగ లేఖ రాశారు. ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' (SIR) ప్రక్రియనూ సమర్థించారు. ఎటువంటి విశ్వసనీయ ఆధారాలూ లేకుండా ఓట్ల రిగ్గింగ్ ఆరోపణలు చేయడాన్ని వారు తప్పుపట్టారు. "ఒకప్పుడు బూత్ క్యాప్చరింగ్, బ్యాలెట్ బాక్సుల ట్యాంపరింగ్, ఎన్నికల సమయంలో హింసాత్మక ఘటనలు వంటివి జరిగేవి. ఆ చీకటి రోజులను దాటుకుని భారత్ ఎంతో మార్పు చెందింది. నేటి ఎన్నికల వ్యవస్థలో పోలింగ్ ఏజెంట్లు, ఈవీఎం సీలింగ్, స్ట్రాంగ్ రూమ్ భద్రత, వీవీప్యాట్ వెరిఫికేషన్ వంటి బహుళ అంచెల తనిఖీ, రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. గెలిచినప్పుడు ఎన్నికల వ్యవస్థ నిజాయతీని పేర్కొని.. ఓడిపోయినప్పుడు రిగ్గింగ్ ఆరోపణలు చేయడం తగదు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695